క్లుప్తంగా

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణంలో కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

పీజీఆర్ఎస్‌కు ఆరు వినతులు



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ హేమావతి

పెందుర్తి: వేపగుంట జీవీఎంసీ జోన్–8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి వివిధ సమస్యలపై ఆరు వినతులు అందాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన కార్యక్రమంలో ప్రజల నుంచి జోనల్ కమిషనర్ కె.హేమావతి వినతులు స్వీకరించారు. ఆయా ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, తగు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులకు జెడ్సీ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జోన్–8 అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉమాచంద్రమౌళీశ్వరుడికి విశేష పూజలు



ఉమాచంద్రమౌళీశ్వర స్వామి

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

నేడు కలెక్టర్, ఎమ్మెల్యే పర్యటన

పరవాడ: స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు మంగళవారం ముత్యాలమ్మపాలెం గ్రామాన్ని సందర్శిస్తారని కూటమి నాయకులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 గంటలకు ముత్యాలమ్మపాలెం గ్రామంలో యోగా అవగాహన కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌తో కలిసి పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు, కార్యకర్తలను కోరారు.

మానసిక రోగి ఆస్పత్రికి తరలింపు



పోలీసుల అదుపులో మానసిక రోగి

పెందుర్తి: సుజాతనగర్ ప్రాంతంలో ప్రజలను భయాందోళనకు గురిచేసిన ఓ మానసిక రోగిని పెందుర్తి పోలీసులు చికిత్స నిమిత్తం నగరంలోని మానసిక వైద్యశాలకు తరలించారు. వివరాలివి.. సుజాతనగర్ 80 అడుగుల రోడ్డు ప్రాంతంలో ఓ వ్యక్తి(30) కొద్దిరోజులుగా సంచరిస్తున్నాడు. ఇళ్లల్లోకి చొరబడి స్థానికులను భయపెడుతున్నాడు. దీనిపై స్థానిక మహిళ కె.ఉమాభార్గవి పెందుర్తి పోలీసులకు సమాచారం అందించారు. తక్షణమే స్పందించిన సీఐ కె.వి.సతీష్‌కుమార్ బ్లూకోట్స్ పీసీలు డి.వెంకటేశ్, ఎం.గోవింద్‌లను అక్కడకు పంపారు. మానసిక వికలాంగుడిని పట్టుకుని వెంటనే ఆస్పత్రికి తరలించారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన 11 మందికి చెరో రూ.10 వేలు చొప్పున కోర్టు రూ.1.10 లక్షలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు తెలిపారు. సోమవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

తొలకరి.. సాగుదారి



ట్రాక్టర్ సాయంతో పొలంలో నువ్వు విత్తనాలు వేస్తున్న రైతు



వర్షాలతో ఊపిరి పోసుకుంటున్న అపరాల సాగు

తొలకరి జల్లులు మొదలయ్యాయి. నీటితోడు ఈశాన్య రుతుపవనాలు కాస్త ముందుగానే పలకరిస్తున్నాయి. దీంతో నియోజకవర్గంలో సాగు సన్నాహాలు మొదలయ్యాయి. వేసవి దుక్కులు పూర్తి చేసుకున్న రైతులు తమ వ్యవసాయ క్షేత్రాలను ఖరీఫ్ సాగుకు సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా కొందరు రైతులు అపరాలు, పచ్చిరొట్ట ఎరువుల సాగుతో ఆదాయం, భూసార సంరక్షణ చర్యలు తీసుకుంటున్నారు.

- వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతాంగం
- ఈ ఏడాది అపరాల్లో నువ్వుల పంటకే ప్రాధాన్యం
- ప్రభుత్వ సాయం కోసం రైతన్నల నిరీక్షణ

పెట్టుబడి సాయమందేనా?

వాతావారణం పూర్తిగా మారడంతో నియోజకవర్గంలోని సబ్బవరం, పెందుర్తి, పరవాడ ప్రాంతాల్లో మూడు రోజులుగా తీరిక లేకుండా వ్యవసాయ పనులు చేస్తున్నారు. రానున్న ఖరీఫ్ కోసం కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు. అయితే వరుణుడు రైతన్నను నిలబెట్టినా.. ప్రభుత్వం మాత్రం అన్నదాతకు మొండి చెయ్యే చూపుతోంది. గత ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు రైతు భరోసా ద్వారా పంట పెట్టుబడి సాయం అందుకున్న రైతులకు గతేడాది మాదిరే.. ఈ ఏడాది కూడా ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం ఎలాంటి సాయం అందించలేదు. దీంతో ఈ ఏడాది ఖరీఫ్ తొలినాళ్లలో పెట్టుబడి కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి ఏర్పడింది



సిద్ధమవుతున్న గంటి నారు

పెందుర్తి: నియోజకవర్గ రైతాంగం పూర్తిస్థాయిలో పొలం బాటపట్టింది. ఖరీఫ్ సీజన్‌కు ముందు తొలకరి సాగుపనులు మొదలయ్యాయి. తాజాగా కురుస్తున్న వానలతో రైతులు ఆశాజనకంగా ఉన్నారు. రెండు మూడు రోజులుగా దుక్కి పనుల్లో నిమగ్నమయ్యారు. చాలా మంది రైతులు అపరాల పంటలు వేస్తున్నారు. నువ్వులు, పెసర్లు,, పిల్లి పెసర, మినుములు తదితర విత్తనాలు చల్లుతున్నారు.

నువ్వుల సాగుపైనే ఆసక్తి

నియోజకవర్గంలో ఏటా ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 6 వేల ఎకరాల్లో వరి పంట వేస్తారు. దానికి ముందు తొలకరి జల్లుల ఆసరాతో నువ్వులు, గంటిచేను, పిల్లి పెసర, మినుములు విస్తారంగా వేస్తారు. ఈ ఏడాది అధిక శాతం రైతులు నువ్వు చేను వైపు మొగ్గు చూపారు. ఇతర పంటలతో పోల్చితే పెట్టుబడి వ్యయం తగ్గడంతో పాటు వర్షాభావ పరిస్థితుల్ని తట్టుకుని ఇది నిలబడుతుంది. పంట సజావుగా చేతికందితే మంచి గిరాకీ ఉంది. దీంతో రైతాంగం దీనిపైనే ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రస్తుతం సబ్బవరం, పెందుర్తి, పరవాడ ప్రాంతాల్లో దాదాపు 500 ఎకరాల్లో నువ్వు విత్తనాలు చల్లారు. మరో 200 ఎకరాల్లో గంటి చేనుతో పాటు ఇతర అపరాల సాగుకు సన్నద్ధమవుతున్నారు.

రైతులకు అందుబాటులో ఉంటున్నాం



ఈ ఏడాది వర్షాలు ముందుగా పడడంతో తొలకరి పంటలకు అనుకూలంగా ఉంది. ఇప్పటికే మండలంలో దాదాపు 250 ఎకరాల్లో నువ్వులతో పాటు ఇతర పంటలు వేశారు. ప్రభుత్వం అందించనున్న అన్నదాత సుఖీభవ పథకం కోసం లబ్ధిదారుల సమోదు దాదాపు పూర్తయింది.

– టి.దుర్గాప్రసాద్, వ్యవసాయాధికారి, పెందుర్తి



గంటి చేను వేసేందుకు దుక్కు చేసిన పొలం

నేల సారాన్ని పెంచుదామిలా..

- సాగుకు ముందు నేల పరీక్ష చేయించడం ద్వారా వ్యవసాయ క్షేత్రం సారం తెలుసుకోవచ్చు. నేలలో ఏయే పోషకాల లోపం ఉందో తెలుసుకుని, అందుకు అనుగుణమైన ఎరువులను వినియోగించి భూసారాన్ని సంరక్షించవచ్చు.
- పశువుల ఎరువులు, కంపోస్ట్, పచ్చికలు, ఇతర సేంద్రియ పదార్థాల ద్వారా నేల సారాన్ని పెంచవచ్చు.
- పచ్చిరొట్ట పైరు సాగుతో నేల స్వభావంలో మార్పు తీసుకురావొచ్చు. పంట ఏపుగా పెరిగాక నేలలో కలియదున్నడం వల్ల సేంద్రియ కర్బనం పెరుగుతుంది.
- రసాయన ఎరువుల కంటే జీవ ఎరువులతో నేల సారాన్ని పరిరక్షించవచ్చు. రసాయన ఎరువులు నేల సారాన్ని క్షీణింపజేయడంతో పాటు, పంట దిగుబడిపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి.
- పంట అవశేషాలను ఎప్పుడూ కాల్చరాదు. దీని వల్ల నేల స్వభావం దెబ్బతింటుంది.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు



అర్జీని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆనంద్‌కుమార్

పెందుర్తి: ప్రభుత్వ భూముల సంరక్షణకు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్ అన్నారు. భూ ఆక్రమణలపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చే ప్రతీ వినతిని క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని చెప్పారు. ఎన్నికల డీటీ అర్జునరావు ఓటర్ల జాబితా అంశంపై తహసీల్దార్‌తో చర్చించారు. పీజీఆర్ఎస్‌కు మొత్తం 9 వినతులు వచ్చాయి. ఆర్ఐ దివ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో అన్నవరం దేవస్థానం ఈవో సుబ్బారావు



కప్పస్తంభం వద్ద సుబ్బారావు దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అయన పేరిట అర్చకులు అంతరాలయంలో స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని ఆలయ సూపరింటెండెంట్ త్రిమూర్తులు అందజేశారు.

ఎన్టీపీసీ బూడిద లారీలతో అనారోగ్యం



దేశపాత్రునిపాలెం కూడలిలో ధూళి మధ్యే ప్రయాణికుల రాకపోకలు

పరవాడ: ఎన్టీపీసీ కారిడార్ అనుసంధాన రహదారి ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. ఈ రహదారిలో నిత్యం రాకపోకలు సాగిస్తున్న బూడిద లారీలతో ఎగసిపడుతున్న ధుమ్మూధూళి కారణంగా సమీప గ్రామాల ప్రజలు తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఎన్టీపీసీ బూడిద చెరువుల నుంచి నిత్యం వందల సంఖ్యలో భారీ వాహనాలతో బూడిదను తరలిస్తున్నారు. ఇవి ఎన్టీపీసీ నుంచి లంకెలపాలెం ఏలేరు వంతెన మీదుగా ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నాయి. వీటి రాకపోకల సమయంలో విపరీతంగా ఎగసిపడుతున్న ధూళితో దేశపాత్రునిపాలెం, రాంకీ కూడళ్ల మీదుగా రాకపోకలు సాగిస్తున్న ఉద్యోగులు, కార్మికులు, వివిధ ప్రాంతాల నుంచి గాజువాక, స్టీల్ ప్లాంటు, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. ధూళిని పీల్చడం వలన గొంతు, ముక్కు సమస్యలు తలెత్తుతున్నాయని వాపోతున్నారు. బూడిద లారీల ద్వారా ఎగసిపడుతున్న ధూళిని అరికట్టేందుకు అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ధ్యానంతో ఆరోగ్యం, ప్రశాంతత



ధ్యానం చేస్తున్న విద్యార్థులు

పెందుర్తి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం కథలు చదవడం, రాయడంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. చిన్నారులకు నీతి కథలను బోధించారు. సామూహిక పుస్తక పఠనం చేయించారు. ఇంగ్లిష్ నైపుణ్యాలు నేర్పించారు. పలు ఆటలు ఆడించారు. ధ్యానంపై మెళకువలు నేర్పారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, పలువురు పాఠకులు పాల్గొన్నారు.

నీతి కథలతో వ్యక్తిత్వ వికాసం



సబ్బవరం గ్రంథాలయంలో పుస్తకాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సబ్బవరం: విద్యార్థులంతా గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి వి.శిరీష సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం నీతి కథలు చదవడం, పుస్తక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమం ద్వారా విద్యార్థులకు నీతి కథలు వివరించి, గ్రంథాలయంలో అందుబాటులో ఉండే పుస్తకాల గురించి తెలిపారు. నీతి కథలతో వ్యక్తిత్వ వికాసం సాధ్యమన్నారు. విద్యార్థులకు అవసరమయ్యే నీతి కథలు, రామాయణం, మహాభారతం, పలు జీవిత చరిత్రలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ డిపార్టుమెంట్ రిటైర్డ్ జాయింట్ సెక్రటరీ రత్నకుమార్‌తో పాటు పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఇంద్రజాల ప్రదర్శన

వేసవి శిబిరంలో ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్‌తో ఆకట్టుకున్న విద్యార్థులు



తయారుచేసిన ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్‌తో విద్యార్థులు



ఇంద్రజాల ప్రదర్శన ఇస్తున్న శరగడం రామకృష్ణ

సింహాచలం: అడవివరం గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో సోమవారం జరిగిన ఇంద్రజాల ప్రదర్శన విద్యార్థులను విశేషంగా అలరించింది. షిప్‌యార్డు విశ్రాంత ఉద్యోగి శరగడం రామకృష్ణ పలు రకాల ఇంద్రజాల ట్రిక్స్ ద్వారా విద్యార్థుల్ని సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తారు. పలు ఇంద్రజాల అంశాలపై అవగాహన కల్పించారు. ఇంద్రజాలాన్ని కూడా సైన్సుగానే చూడాలని, విజ్ఞానం పెంచే కళ ఇంద్రజాలమన్నారు. కొందరు ఇంద్రజాలాన్ని మాయలు, మంత్రాలుగా అభివర్ణిస్తుంటారని, అది తప్పుడు భావనగా పేర్కొన్నారు. సాధన చేస్తే ఎవరైనా ఇంద్రజాలంలో రాణించవచ్చన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు నృత్యాలు, పాటలతో అలరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సొంతంగా తయారుచేసిన ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్‌ను ప్రదర్శించారు. విద్యార్థులకు బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్మిక నాయకుడు సీహెచ్ఎస్ఎన్ రాజు, దేవస్థానం విశ్రాంత సూపరింటెండెంట్ కామేశ్వరరావు, గురుకుల పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు లోవబాబు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కేఎస్ఆర్ మూర్తి, గ్రంథాలయాధికారి ఎన్.వి.నరసింహం తదితరులు పాల్గొన్నారు.

పేరుకుపోతున్న చెత్తాచెదారంతో ఇబ్బందులు



టిడ్కో కాలనీ రహదారిలో పేరుకుపోయిన చెత్తాచెదారం

పరవాడ: స్థానిక టిడ్కో కాలనీ సముదాయానికి వెళ్లే రహదారుల పక్కన చెత్తాచెదారం పోగవడంతో కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో డస్టబిన్‌లు(చెత్తకుండీలు) ఏర్పాటు చేయకపోవడంతో కాలనీ ప్రజలు ఇళ్లలో ఊడ్చిన చెత్తను రోడ్లపై పోస్తున్నారు. ఈ చెత్తను తరలించేందుకు అవసరమైన చర్యలు తీసుకోకపోవడం వలన ఎక్కడికక్కడ చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. కాలనీలోని చెత్తను తీసుకెళ్లేలా చెత్త బండిని ఏర్పాటు చేయాలని కాలనీ ప్రజలు కొన్నాళ్లుగా అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. అయినా పట్టించుకున్న పాపాన పోవట్లేదని కాలనీకి చెందిన బంగారమ్మ అనే మహిళ వాపోయింది. రోడ్ల పక్కన పేరుకుపోతున్న చెత్త కుప్పల కారణంగా దోమలు పెరిగి, అనారోగ్యం బారిన పడుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. తమను పీడిస్తున్న ఈ చెత్త సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సరిపల్లిలో ఘనంగా తొలేళ్ల సంబరం

నేడు పరదేశిమాంబ పండగ



సరిపల్లిలో ఘటాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

పెందుర్తి: సరిపల్లి గ్రామ దేవత పరదేశిమాంబ వార్షిక పండగ సందర్భంగా సోమవారం రాత్రి తొలేళ్ల సంబరం ఘనంగా జరిగింది. గ్రామ పుర వీధుల్లో ఘటాలు ఊరేగించారు. దారి పొడవునా అమ్మవారికి గ్రామస్తులు పూజలు చేసి, పిండి వంటలు నైవేద్యంగా సమర్పించారు. మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం పండగ సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరుగుతాయని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. సాయంత్రం అనుపోత్సవం జరుగుతుందన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

యోగా విశిష్టతపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో ఆరోగ్య కేంద్రం డీసీఎస్‌లు, వైద్యులు, హౌస్ సర్జన్లు, సిబ్బంది

సింహాచలం: వచ్చేనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగా విశిష్టతపై అవగాహన పెంచేలా అడవివరం ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఆస్పత్రి వైద్యులు, స్టాఫ్ ఆరోగ్య కేంద్రం నుంచి మార్కెట్ కూడలి వరకు ర్యాలీగా వెళ్తూ యోగా ద్వారా కలిగే మానసిక, శారీరక ప్రయోజనాలను వివరించారు. ఆరోగ్యకేంద్రం డిప్యూటీ సివిల్ సర్జన్స్ డాక్టర్ నాయక్, డాక్టర్ రామరెడ్డి, మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ అరుణ్‌ప్రకాష్, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ సుదర్శన్, డాక్టర్ మాధవి, డాక్టర్ పార్వతి, సిబ్బంది పాల్గొన్నారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

సబ్బవరం: ప్రభుత్వం అందించే ఉచిత శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని మహిళలకు ఆర్థిక భరోసాను పొందాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ శిక్షణ తరగతులను సోమవారం ప్రారంభించి, మాట్లాడారు. బీసీ కార్పొరేషన్ సహకారంతో 90 రోజుల పాటు మహిళలకు ఈ ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం అర్హులైన లబ్ధిదారులకు ఉచితంగా కుట్టు మిషన్లను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం మండల పరిషత్ అవరణలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో అమృతపురం రైతులు పండించిన కూరగాయల స్టాల్‌ను సందర్శించి, కూరగాయలను కొనుగోలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, వైస్ ఎంపీపీ దాడి ఝాన్సీలక్ష్మీరాణి, ఎంపీడీవో పద్మజ, ఎంపీటీసీలు బైలపూడి దేముడుబాబు, కర్రి అప్పారావు, పార్టీ నాయకులు ఇందల రమణ, బలిరెడ్డి అప్పారావు, కర్రి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు రాయితీపై దాణా పంపిణీ



పాడిరైతులకు దాణా అందజేస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారులు

అగనంపూడి: అగనంపూడి పరిసర ప్రాంతంలోని రైతులకు రాయితీపై పశువుల దాణా అందించారు. అగనంపూడి పశువుల ఆస్పత్రి ఆవరణలో పాడి రైతులకు 50 శాతం రాయితీ ధరకు వీటిని అందించారు. 45 మంది రైతులకు 120 బస్తాల దాణా అందించినట్టు పశువైద్య నిపుణురాలు డాక్టర్ లావణ్య తెలిపారు. సహాయకుడు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు కనకదుర్గమ్మకు సారె సమర్పణ



కనకదుర్గమ్మ

పెందుర్తి: సౌభాగ్యరాయపురం(ఎస్ఆర్ పురం)లో కొలువుదీరిన కనకదుర్గమ్మ మారువారం పండగను మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కాయిత ఎర్రిబాబు తెలిపారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి భారీ ఎత్తున సారె ఊరేగింపు ప్రారంభమవుతుందని చెప్పారు. భక్తులంతా వేడుకలో పాల్గొనాలని కోరారు.

మానసిక చికిత్స కేంద్రం సందర్శన

మహారాణిపేట: చిన్న వాల్తేరులోని ప్రభుత్వ మానసిక రోగుల చికిత్స కేంద్రాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు సోమవారం సందర్శించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు అనుమతితో ఆయన కేంద్రంలోని వార్డులను పరిశీలించారు. రోగుల మానసిక స్థితి, వారికి అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంట గదిని తనిఖీ చేసి ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. ఆస్పత్రి ప్రొఫెసర్ డాక్టర్ డి.విజయలక్ష్మి, లీగల్ వలంటీర్ కె.ఉమామహేశ్వరి పాల్గొన్నారు. ఆ తర్వాత సేవాధికార సంస్థ కార్యదర్శి కేజీహెచ్‌లోని వన్ స్టాప్ సెంటర్‌ను సందర్శించి బాధితులకు అందుతున్న సౌకర్యాలు, కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది మరింత మెరుగ్గా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో లీగల్ వలంటీర్ ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.